

# నిర్దోషి

★

రచన: "ప్రవీణ్ సుశ్రీ"

(గత సంచిక తరువాయి)

"హా! ఇదంతా నాటకమేనండీ! వెధవ! మళ్ళా నీళ్ళుచల్లండి! కాంతమ్మ అంటూనే శంకరంచేతిలో వున్న చెంబును లాగేసుకుని చల్లకుండా ఆ చెంబెడు నీళ్ళూ రామూ ముఖం పై నిర్దాక్షిణ్యంగా పోసేసింది రాము అపస్మారకంనుండి కాసేపటికి లేచి కూర్చున్నాడు రక్తంతో ముద్దగా తడిసిన చొక్కాతో ముఖం తుడుచుకున్నాడు. వగరుస్తూ అలానే కూర్చుండి పోయాడు వాళ్ళముఖాలవేపు చూస్తూనే. చెప్పలా! మీకు తెలియదండీ! వీడిదంతా ఒతినాటకం అలానైనా మీరు దయదలచి వదలిపెడతారేమోనని" కాంతం కొంచం సావధానంగానే అడిగింది. గిరి! నీలకంఠులు అప్పటి వరకూ భయకంపితులై వున్న వారల్లా రామూ లేవడంతో ఇదంతా నిజంగా నాటకమే! అని నిర్ధారణచేసుకుని కళ్ళప్పగించి చూస్తున్నారు రాముకెల్ల!

రాము అందర్నీ ఒకసారి దీనంగా చూచాడు వీళ్ళ బాధలకు తట్టుకోలేక "నిజంగా నేనేతీశా" నని అబద్దం చెప్పితేనే బావుండుననుకున్నాడు, మనస్సులో గానీ ఏమీ బదులు పలుకలేదు. "మీ ఇష్టం!" అన్నట్టుగా శంకరం వైపు దీనంగా చూశాడు. "అ! ఇక దొరికినట్లే! మనం వాడిని అడగడం వాడుతియ్యలేదని చెప్పడమూను ఇక లాభం లేదండీ! పోలీసుస్టేషనుకి తీసుకపోండి వెధవని, వాళ్ళుఅయితే! సరిగ్గా రాబట్తారు! "ఊ! తీసుకపోండి!" కాంతమ్మ ఆర్డరు వేసింది. "అవును బాబాయ్! బాగుంది! అలానే చెయ్యండి!" ఏమీదరిదోచక రామూని చూస్తున్న శంకరానికి తన ఐడియా నూటికి నూరుపాళ్ళు జయప్రదం అవుతూన్నదన్న ఔత్సుకతతోనే ఉగ్గడించాడు నీలకంఠం.

"రామూ, గిరీ నీలకంఠాలను ఒకసారి దీనంగా చూశాడు నీలకంఠం ప్రవర్తన రామూకి తెలియనిదేమీ కాదు కొట్టిన పిండే! అసలు ఇదంతా నీలకంఠమే చేశాడని అవగాహన చేసుకున్నాడు. "అలా చెప్తే!?" ఎవరునమ్ముతారు? లాభం! లేదు అ! భగవంతుడే! నాకు సాక్షి! ఈ చిత్రప్రవృత్తులతోనే రాము వుండి, మౌనంగా వుండి పోయాడు.

శంకరం ఇక లాభం లేదని వారుచెప్పిన సలహాయే బావుందని రామూ "బాబూ! నేను నిర్దోషిని బాబూ!" అని రొధ చేస్తున్నా విన్పించుకోకండా రామూని బరబరా పోలీసుస్టేషనుకి ఈడ్చుక వెళ్ళాడు. గిరి, నీలకంఠంగూడా వెళ్ళారువెంబడి.

♦ ♦ ♦

నీలకంఠం, మోహన్, మధుల వద్ద చెరో పదిరూపాయలు వసూలు చేశాడు. వాళ్ళుమాత్రం "మద్రాసు ఎపుడు వెళ్ళాంరా!" అనడిగితే! నీలకంఠం "ఓరేయ్! మీ రిద్దరూ ఇప్పుడు పది! పదిరూపాయలేగా ఇచ్చింది? ఇంకా పది, పదిగాకపోయినా గిరిగాడు వాళ్ళనాన్న వాచీ తెచ్చేలోపల చెరో ఐదు పట్టుకరండిరా! వెళ్దాం!" అని దొంగమాటలు నెప్తూనే వచ్చాడు. గానీ వాళ్ళకు గిరి తెచ్చిన వాచీ వీళ్ళిద్దరి దగ్గరా వుందని మాత్రం చెప్పలేదు. ఒక సుముహూర్తం జూచి ఆవూరికి కొత్తగా ఒకాయన వస్తే! ఆయనకు అమ్మివేశారు, అతడైతే ఎక్కువ రోజులు ఆవూరిలో వుండడు. పొరుగూరు వాడుగదా యని వాళ్ళభావ. అవచ్చిన డబ్బులూ నీలకంటం దగ్గరనే వుంచుకున్నాడు రెండుమూడు రూపాయలు మాత్రం ఆరోజు ఇద్దరూకలిసి వాడేశారు. మొత్తానికి, మధు, మోహన్‌లకు తెలియకుండా రాత్రికిరాత్రే వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నారు. ఈసలహా ఇచ్చిందీ

నీలకంఠమే! గిరి అందుకు అంగీకరించాడు. "సరే! నీవు వెళ్ళి భోజనం చేసి ఆ శివాలయందగ్గరకురా! నేనక్కడ నీకోసం కాచుకుకూర్చొనివుంటా" నని నీలకంఠం చెప్పాడు. గిరి అందుకుముందు ఒప్పుకోలేదు కానీ నీలకంఠం అంత తెలివి తక్కువవాడా! ఓరేయ్! గిరి! నేను నిన్ను మోసంచేస్తానను కుంటున్నావు గదురా? కాదురా! నీవింట్లో కనిపించకపోతే! మీ అమ్మానాన్నలు అనుమానం పడతారు కాబట్టి, నీ ఒకసారి వెళ్ళికనిపించి వచ్చావంటేచాలు!" అందుకనే నేనలాచెప్పానురా! లేకుంటే! నీఇష్టం!" అన్నాడు. గిరిని నమ్మించే ధోరణిలో గిరికి మొదట అనుమానం వేసినా ఇలా నీలకంఠం నమ్మించి చెప్పడంలో పూర్తిగా నమ్మాల్సి వచ్చింది. అయినా ఎప్పుడూ తల్లిదండ్రులను ఇంటినివదలి ఎక్కడకూ వెళ్ళని వాడుగాక పోవడంతో ఆ అనుమానం పోయినా ఇప్పుడు క్రొత్తగా భయం అనేది పట్టుకుంది. గానీ! అదీ మద్రాసుచూడాలనే కోర్కతో అట్టడుగున పడిపోయింది చివరికి "సరే! అలాగే! మరివుంటావు గదూ!" అంటూ సెలవు తీసుకొని ఇంటి ముఖంపట్టాడు గిరి. నీలకంఠం తన పాచిక పారినందుకు ఒక్క కానీ లేకుండా ఉచితా మద్రాసు వెళ్ళగల్గుతున్నందుకు తన అఖండమైన తెలివితేటలకు తన్నుతానే అభినందించుకుంటూ తన నుండి గిరి పూర్తిగా దూరం కాగానే! నీలకంఠం ఆ దుప్పటితో! ప్రక్కవూరికి వెళ్ళాడు.

అక్కడినుండి మద్రాసు వెళ్ళవచ్చునని, అదీగాక వాళ్ళ వూరిలో స్టేషను లేకపోడవమువల్ల నీలకంఠానికి ప్రక్కవూరికి వెళ్ళక తప్పిందికాదు అంతేకాదు ఆవూర్లో నీలకంఠంతో చదరవు పూర్తితిరిగొచ్చిన ఒక స్నేహితుడు కూడా వున్నాడు. ఎలాగైతేనేం! మొత్తానికి నీలకంఠంకోర్క నెరవేరింది. ఆ స్నేహితులిద్దరూ మద్రాసు బండి ఎక్కారు.

గిరి భోజనం చేసి చక్కా శివాలయం దగ్గరకు వచ్చి చూశాడు అరగంటాగాడు! ఒకగంట చూశాడు. ఎంతకీ రాకపోవడంతో! అనుమానంతో బాటు భయంకూడా కలిగింది. నీలకటం ఇంటికి వెళ్ళి వాకబుచేయగా "వాడు ప్రొద్దున్నే ఇల్లు విడిచిపోవడం ఇంటికి ఇంకారాలేదు" అని వాళ్ళమ్మ చెప్పింది. గిరికి ఇంక ఏమి చేయాలో పాలుపోలేదు. మధుమోహన్ల వద్దకు వెళ్ళాడు. "మా యింటికి రాలేదంటే! మాయింటికీ రాలేదన్నారు" వాళ్ళకు జరిగిన విషయమంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు వాళ్ళిదరూ తెల్ల మొఖాలు వేశారు. ఏమయితే నేం? ముగ్గరమూ మోసపోయాం "ఈ విషయం ఎవరితోటి చెప్పగూడదురోయ్! చెప్పగూడదని" తేలుకుట్టిన దొంగల్లా!" కిక్కురు మనకుండా వున్నారు. నీలకంఠం వచ్చిన తర్వాత ముగ్గురూ కలిసి బాగా [illegible] మాత్రం నిర్ధారణ చేసుకున్నారు.

◆ ◆ ◆

రోజులు రోడ్డురోలరులా భారంగానే దొర్లిపోతున్నా రామూకు అప్పటికి జైలు శిక్షపడి, రెండుమూడు నెల్లపైగానే అయ్యింది. చిన్నవాడు కాబట్టి రామూను బళ్ళారి పిల్లలజైలుకి పంపారు. అక్కడ రామూపరిస్థితి మరింత దుర్భరంగానే అయ్యింది. అన్నము సరిగ్గాముట్టడు ఎవ్వరితోనూ ఏమీ మాట్లాడడు. మొదట అందరూ "మూగవాడు పాపం" అని అనుకున్నారు గాని కొన్ని రోజుల తర్వాత రాము ఒక్కడే ఏమిటో తనలో తానే "వసంతానికి విరియ బూసిన ప్రసూనంపై, దివారాత్రులూ "ఝుమ్" మనిరొద చేస్తూ! ఆనందంతో! ఎగురుతూండే! తుమ్మెదలాంటి జీవితం! నిరాధారంగా ఆకాశంలో ఎగురుతూండే ఓ దారంతెగిన గాలిపటం లాంటి తనజీవితం. ఇలా పంజరంలో చిలకలా కదలకుండా మెదలకుండా చిరప్రాయంలో నిరంతరము చిరునవ్వుతోనే చిందులుత్రొక్కుతూ గడపవలసిన తన ఉషస్సు...

జీవితము ఇలా దుఃఖభాజనం చేసుకోవాలసి వచ్చిందే మాని విచారిస్తూ పలవరించేప్పుడు మాత్రమే కనుక్కున్నారు అంతా "కాదు! ఇతడు మూగవాడుకాదు" అని వాళ్ళుపలుకరించినా, పిలిచినా పలుక్కుండా అలా వారిని పిచ్చిగా చూడ్డంవల్ల "కాదు మూగవాడుకాదు పిచ్చివాడు" అని నిర్ధారించేశారందరూ నిశ్చయంగానే.

కాని కొన్నిరోజుల తర్వాత రాము అందరి హృదయాల్లో ఘనీభవించివున్న కర్కశాన్ని శిలలకంటే కఠినంగా వున్న కఠినాత్ముల కరకుకాయి గుండెల్ని ద్రవింప జేసి దుఃఖార్తులనుగా చేయగల తన విషాదగాథను వివరంగా! ఒక్కసారిగా వారిముందు నోరు విప్పి చెప్పగానే' కనుకున్నారంతా ఇతడు మూగవాడు కాడు! పిచ్చివాడుకాదు! నిజంగా ఇతడు "నిర్దోషి" అని.

కానేకాదు హృదయంగల వాళ్ళందరూ "నిర్దోషి"

అని చెప్తే ఏమిలాభం? ఇన్నిరోజులు గడచిన తర్వాత? కోర్టు తీర్పు చెప్పింతర్వాత? చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకుంటే మాత్రం ఒరిగేలాభం ఏముంది?

రాము ధైర్యస్థితికి జాలిపడేవాడిలో ప్రథముడు జైలు సూపరింటెండెంటు కాని తానేం చేయగలడు? శిక్ష పడింతర్వాత! కోర్టు నిర్దోషికి "దోషి" అని ముద్ర వేసింతర్వాత? ఆధారాలేవి? ప్రభుత్వం విధించిన శిక్షను కాదనే వాళ్లెవరు? రాములో ఇపుడా వరకటికళ లేదు. ఎలావుంటుంది? నిమిషం నిదుర లేదు తిండి తిప్పలులేవు! ఆరోగ్యం చెడి, దగ్గు ప్రారంభమైంది నిరసించిపోయాడు కాగా, ఒక్క చూపు అదైనా! అస్పష్టంగా! నే ఆ వేదన! అనిశ్చితత్వాలతో! మిళితమైన అర్థం పర్థం లేని పిచ్చిచూపే! పగుళ్ళువారిన నేలలా నిస్సారంగానే వుందా జీవితం! అతనిలో మూర్తీభవించిన ఆత్మజ్యోతి నేడో! రేపో! అన్నట్లుగానే వుంది! అతనిజీవితం గాలిలో దీపంలాగుంది అడిమరో సెకండు వుండదు పాపం! మానవ జీవితం అంతే!

ఈ రాము జీవితంగూడా అంతే! అప్పటికీ జైలు సూపరింటెండెంటు వైద్యసహాయం తిండితిప్పల విషయం బాగానే చూస్తున్నాడు! గాని! అతని మనోవ్యాధిని ఎవరుబాగుచేయగలరు? అదే! రాముని నానాటికీ కృంగదీస్తోంది,

పడుకునే ఆచల్లని బండకు నిజమైన మంచి స్నేహితుడిలా వప్ప జెప్తోంది రాము మందులూ మాకులూ సరిగ్గా తీసికోడు ఆహారంలాగునే వాటిని పూర్తిగా విసర్జించాడు.

అతను ఇప్పుడు రాములా లేడు ఒక మానవ ప్రాణిలా లేడు. ఏదో ఒక ఎముకల ప్రోవుకి అస్థిపంజరానికి మాంసం కండ కాస్త పైనచర్మం అతికించీ! అతికించకండా! నరాలగీతలు మాత్రం! విస్పష్టంగా! అతిచాకచక్యంగా! గీచి, ఓ! పక్కమంచంలో "ఒకటి జీ. రోగిశవం" అనే నామకరణంతో! చచ్చినకాలేజీ ఎగ్జిబిషన్‌లో పెట్టిన ఓ శవం బొమ్మలాగే వుందా రాము కళేజరం. కాని! విచిత్రమేమంటే! భేదమేమంటే! ఆ బొమ్మవులుకదూ! పలుకదు. ఈ కళేబరం మాత్రం వులుకుతూంది! పలుకుతూంది బాధగా "బాబూ! నేను నిర్దోషిని బాబూ!" అని అతి దీనంగా అతి హీనంగా! అటు ఇటు కదులుతోంది "ఊ" అని వ్యథతో వ్యాకుల పడ్తోంది! అంతే తప్ప! ఇంకే చేష్టలు లేదు.

♦ ♦ ♦

అది ఆదివారం. రేపే సంక్రాంతి పండుగ, పండక్కి బజారంతా చూసుకొని శంకర్రావు "పండుగ స్పెషల్" అని పండుగ రేపే అయినా ఒక వారం నుంచీ చెట్టుక



మీకు తెలుసా? మీరు ధరించియున్నది.
సి. టెక్స్
బనియన్లని?
లేనిచో, నేడే "సి. టెక్స్" బనియన్లను
కొని ధరించండి.
అవి:_ చక్కని అల్లిక _ సరైన కొలత,
దీర్ఘకాలం మన్నిక, ధరించితే హాయి నిచ్చును.
: తయారించువారు :
Grams: CEETEY Phone: 21290
CHOWDAMBIKAI KNITING CO.,
KAMARAJ ROAD : : TIRUPUR - 638604

పురిపోసుకున్న శవంలా తాళ ఫలప్రమాణ మంతేసి అక్షరాలతో వ్రేలాడుతోన్న ఓ కాఫీహోటలు బోర్డుమీదకు వున్నట్టుండి చెట్టు మీదకు పాములా ప్రాకింది అతని దృష్టి ఇంకేం! అటూ-ఇటూచూసి వుడాయించాడు లోనికి కన్నంలోకి ఎండ్రిక వెళ్ళినట్టుగావే అవును మరి పదుగురు చూస్తే పళ్ళికిలించరు? అంతమనిషి ఇంత చిన్న హోటల్లోకి వెళ్ళాడని! లోపల తనకు తెలిసిన వాళ్ళెవ్వరూ లేరని చూచిన మీదట సంతోష సంతుష్టుడయ్యాడు. సర్వరు ఒకడే అవడంచే ఆలస్యం అవుతోంది ఏదో ఆలోచిస్తూ! బయటకు దృష్టి సారించాడు.

"బాబూ! కానీధర్మం" జుట్టురేగివుంది దానికి తైల సంస్కారం అసలెప్పటినుంచో లేనట్లుగానేవుంది. చొక్కా రెండు చేతులూ భుజాలవరకూ చినిగి అటు బనీను, ఇటు చొక్కా అని తేల్చి చెప్పలేనంత క్లిష్ట సమస్యను తెచ్చిపెట్టోంది చూపరులకు. నిక్కరు ఒక భాగం బాగా తొడవరకూ రెండవభాగం మోకాలుకు కాస్తపైగా మామూలుగా వుండి మొత్తానికి "నిక్కరే" అనిపించుకుంటోంది, కళ్ళలోతుకు పొట్టగూడాలో పలికిపోయింది. దవడలూ అంతే! ఎందుకో ఆ అబ్బాయిని చూడగానే! రాము చప్పున గుర్తుక వచ్చాడు.

"బాబూ! కానీ ధర్మం" ప్రొప్రయిటర్ను అడిగాడా అనాథ బాలుడు "పోరా దొంగ వెధవా!" అని కోపంగా కసరికొట్టాడు. వాడు బిక్క మొఖంతో శంకరం వేపు చూశాడు, శంకరం హృదయం కరిగింది ఓ పావులా బిళ్ళ జేబులోంచి తీసి వాడికిచ్చాడు. వాడుసంతోషంతో వెళ్ళిపోయాడు.

"ఎందుకుసార్ వాడికిస్తారు? దొంగవెధవలండీ వీరంతా" అన్నాడు ప్రొప్రయిటర్ శంకర్రావు. ఏమీ బదులు పల్కలేదు రామును చూస్తున్నట్టుగానేవుంది. వాడు వెళ్ళినవైపుకే చూస్తున్నాడింక పోయినసారి ఇదేపండుగ రోజుల్లో తాను రాముతో కలిసివచ్చాడు. ఇక్కడకు, గిరీతో బాటూ, రాముకి బట్టలు కొన్నాడు అపుడు రాము "మీరు చాలామంచివారండీ! బాబుగారూ" అన్నాడు కృతజ్ఞతా భావంతో. అదంతా ఇపుడు శంకర్రావు స్మృతి పథంలో ఒక్కసారి ఫిలింరీలులా తిరిగింది. ఎంతకీ సర్వరు రావడములేదు అవతల వారితో సేపతమత మాతున్నాడు వాడు.

విసుగు, విరక్తి కల్గింది ప్రక్కతను "వాకేం అక్కర్లేదు" అన్నట్టుగానే దిన ప్రతిక చదవడంలోని మగ్నమైయున్నా, కాలాతీతం అవుతూంది.

"ఏమండీ! టైమెంతయింది?" పేపరు అంతు తేల్చుకుంటున్న ఆపెద్ద మనిషిని అడిగాడు శంకరం. అలా అడుగుతున్నపుడు శంకరంచాలా బాధపడ్డాడు తన గడియారం గుర్తుక వచ్చింది తను ఎంతమందికి ఇదివరకు ఎంత గర్వంగా టైం చెప్పలేదు? ఇపుడు తను ఇంకొకర్ని అడగడం చాలా చిన్నతన మనిపించింది.

ఆ పెద్ద మనిషి తన ధారావాహినికి ఆనకట్టలా అడ్డుపడిన శంకరంను చూచి రుస, రుస మని చూచి విసుగ్గా "పదింపావు'. అని నిర్లిప్తగా పలికి మరలా పేపర్లోకి తలదూర్చేసు కున్నాడు. శంకరం దృష్టి హఠాగా వాచీ మీద పడింది అదిస్మగుల్డ్ "ఎనికార్ రిష్టువాచ్" అదే! సరిగ్గా! అదే! తనదిలాగేవుంది. అటువంటి వాచి ఈ వూర్లో తనకి తప్ప మరింకెవరికీ లేదు ఈ విషయంలో శకంరం చాలా గర్వించేవాడు, అదైనా తన మిత్రుడు విశ్వనాథం వైజాగ్ పనిమీద వెళ్ళినపుడు తెప్పించుకున్నాడు. విశ్వనాథం గూడా తెచ్చుకున్నాడు గాని, అది పొరపాటున ఎక్కడో ఎపుడో పొగొట్టుకున్నాడు. గనుక ఆవూర్లో మరింకెవరికీ లేదనేచెప్పాలి అవును చచ్చులేదు.

"ఇది నాదే! ఈహోటలు ప్రొప్రయిటరుగూడా చాలాపార్లు కన్నవేశాడు కొందామని, గాని తను ఇవ్వదలంచలేదు.

అయినా ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు? చల్లకి వచ్చి ముంతదాచట మెందుకు? "అతన్ని, అతన్ని అడిగితే" ఏమనుకుంటాడో ననే అనుమానం. అసలు తనదో కాదోనని అతను పేపరుచదవడంలోని మగ్నమైయున్నపుడు తీరిగ్గా చూశాడు, మరలా పైన సన్నగీత సేపుచివర చినుగు కనుపించాయి. చచ్చులేదు ఒకసారి తను చీరాల వెళ్తుండగా ఆ ఆదుర్దాలో రిక్షా ఎక్కుతూండగా రిక్షాటాపుకున్న ఇనుపకడ్డీ తగిలి పైన అడ్డ అసలు వక్కలుగా పలుకలుగా పగలవలసింది, కాని, కాస్త దయ, జాలి, కనికరంచూపె కాబోల్ను, చిన్న గీరగా పడి నిలిచిపోయింది. ఆ బెల్టుదానిలో సరిగ్గా పట్టదు పని తొందరలో పెట్టడం వల్లఅది చివర, చినిగి, పిగిలిపూరుకుంది చివరకి ఆరోజు ఆవాచి దెబ్బతిన్నపుడు తను ఎంతగా విచారించాడని? ఇవన్నీ శంకరానికి గుర్తుక

వచ్చాయి. అయినా అడుగుదాం ఇంకా తనదో కాదోననే అనుమానపిశాచం తనహృదిలో గట్టిగా పట్టుకొని వుండడము వల్ల అడిగేశాడిలా, "ఏమండీ! ఇలా చూడండి! పాపం! మిమ్మల్ని పేపరు చదువనీకుండా ఇబ్బంది పెట్టూన్నందుకు."

"ఆ అబ్బే అదేం లేదులెండి! ఏమిటో చెప్పండి?

ఆ పెద్ద మనిషి లోలోపల శంకరాన్ని నానాబండ బూతులు తిట్టుకుంటూనా పైకలా అన్నాడు.

"ఆ ఏం లేదూ మీవాచ్ భలేబావుందండీ ఎక్కడ తీశారేమిటి? ఖరీదెంత?

వాడువుబ్బి తబ్బిబై తన్నుతాను తమాయించుకొని అన్నాడు. "ఎక్కడా! కొన్లేదండీ ఎవరో ఇద్దరు వక్రాళ్ళు చాలా తక్కువ ధరకే ఇచ్చారు బావుందికదండీ" అన్నాడు మళ్ళీ నాలుం కరచుకున్నాడు. ఆరే శారపాటైంది ఎందుకు చెప్పానా? అవి? ఎవరైనా అంతే అసలుచొక్కా బాగోకపోయినా వాణ్ణి కాసేపు పిచ్చి వాణ్ణిగా చేద్దామని "బాగుంది" అని అంటేచాలు ఇక మనం వింటూంది లేనిదీ వాడు గ్రహించకుండానే అది ఎక్కడకొందీ ఎంత చెప్పగా తాను కొనిరి కొనిరి ఎంతకు కొందీ ఇంకా అంతేగాక ఆరోజు జరిగినరోడ్డు మీద సర్కసుఫార్సు, టైలరు కొలతలు ఇంకేమేమో చెత్త చెప్తూ ఎదుటి వారిని చిత్తు చేసేస్తారు ఇంతలో సర్వరు వచ్చాడు వాడికి రెండు కాఫీలు చెప్పాడు. ఆపెద్ద మనిషి విస్తుపోయాడు ఇద్దరువక్తాళ్ళనగానే తనదికాదే మోననే అనుమానంవచ్చి అయినా ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు? చల్లకివచ్చి ముంతదాచట మెందుకు? అతన్నడిగితే ఏమనుకుంటాటో? ననే అనుమానం భయభీతుల్లేకుండానే ధైర్యంగానే అడిగాడు శంకరం.

"ఏమండీ! మీరేమీ అనుకోకండి నేనిలాప్రశ్నలు వేస్తున్నందుకు? ఆ యిద్దరు పిల్లలు ఎలావుంటారు? చెప్పగలరా? ఇలా అడగటంతో ఆ పెద్దమనిషి బెదురుకున్నాడు కాస్త అసలు ఇలా ఎందుకుచెప్పానా?" అసలు చెప్పడమా? మానడమా? ఆ సందిగ్ధావస్థలో సతమతమౌతూండగా అక్కడికి అనుకోనిరీతిగా విశ్వనాథం వచ్చాడు. చేతిలో కూరగాయల సంచి వుంది. శంకరంను చూశాడు. "ఏమండోయ్ ఇలా వచ్చారేం? అయినా నన్నుపిలువకుండా వచ్చారే? నన్ను పిలువకుండా కాఫీ తాగేద్దామనుకున్నా రేమిటీ? అదేం కుదరదు" కూర్చుంటూ అన్నాడు ప్రక్కనే సంచి క్రింద పెట్టూ.

(సశేషం)

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులు కాదు. —సంపాదకుడు.

★

ఉమాలక్ష్మి కంబైన్స్ వారి "విచిత్ర జీవితం" చిత్రంలో జయమాలిని

★

